సాక్షి ఒడిశా

మంగళవారం । 3 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,67,607లు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఘనంగా నీలమ్మ ఉత్సవాలు

పర్లాకిమిడిలో నీలమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

- IIలో



వియత్నాంలో గవర్నర్..

గవర్నర్ హరిబాబు వియాత్నంలో పర్యటిస్తున్నారు. ప్రముఖ ఆలయాలు సందర్శిస్తున్నారు.

- IIలో

రథయాత్రకు ..
భద్రతా ఏర్పాట్లు పటిష్టం

భువనేశ్వర్:

ప్రపంచ ప్రఖ్యాత పూరీ రథయాత్ర కోసం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 27న ఈ యాత్ర జరగనుంది. రథ యాత్ర ఆద్యంతాలు సజావుగా, సమర్థంగా నిర్వహించేందుకు రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా అధ్యక్షతన ఒక ముఖ్యమైన సమావేశం జరిగింది. సోమవారం కటక్‌లోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. పోలీసు విభాగం సీనియర్ అధికారులు రథ యాత్ర సజావుగా జరిగేలా చురుగ్గా, అప్రమత్తంగా ఉండాలని డీజీపీ ఆదేశించారు. శ్రీ జగన్నాథ ఆలయ సంప్రదాయం ప్రకారం పలు ఉత్సవాలు, వేడుకలు చోటు చేసుకుంటాయి. ఈ కార్యక్రమాలు వివిధ తేదీల్లో నిర్వహిస్తారు. వాటిలో ప్రధానమైనవి జూన్ 11న దేవ స్నాన పూర్ణిమ, జూన్ 26న నవ యవ్వన అలంకార దర్శనం, జూన్ 27న రథ యాత్ర, జూలై 01న హెరా పంచమి, జూలై 04న సంధ్యా దర్శనం, జూలై 05న బహుడా యాత్ర, జూలై 06న స్వర్ణ అలంకరణ, జూలై 07న ఒధొరా పాణా మరియు జూలై 8న నీలాద్రి విజేగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా, దేశం నలుమూలల నుంచి విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు పూరీని సందర్శిస్తారు. ఈ సందర్భంగా యాత్రికుల భద్రత కోసం విస్తృతమైన భద్రతా ఏర్పాట్లను ఈ సమావేశంలో చర్చించారు. రథ యాత్రకు భద్రతా ఏర్పాట్లను పెంచుతారు. ప్రత్యేకంగా సీనియర్ పోలీసు అధికారులను మోహరిస్తారు. పూరీ పట్టణంలో వివిధ ముఖ్యమైన ప్రదేశాలలో సీసీటీవీల ఏర్పాటు, రోడ్ డివైడర్లు, ట్రాఫిక్ నిర్వహణ కోసం డిలినేటర్లు, ట్రాఫిక్ జోన్ ఏర్పాట్లు, నగరంలోని వివిధ ప్రదేశాలలో తగినంత పార్కింగ్ ఏర్పాట్లు, క్రమబద్ధమైన ట్రాఫిక్ ఏర్పాట్ల నిర్వహణ మొదలైన వాటిపై సమావేశంలో చర్చించారు. పూరీ బీచ్‌లో పోలీసుల గస్తీ, తాత్కాలిక పోలీసు అవుట్‌పోస్టుల నిర్వహణపై సమీక్షించారు.



డీజీపీ అధ్యక్షతన పోలీసు ఉన్నతాధికారుల ప్రత్యేక సమావేశం

దీంతో పాటు, పూరీ, భువనేశ్వర్, ఖుర్దారోడ్ రైల్వే స్టేషన్లలో రైల్వే పోలీసుల భద్రతా ఏర్పాట్లను రాష్ట్ర పోలీసు వర్గాలు చర్చించాయి. ఈ నేపథ్యంలో రైల్వే రక్షక దళంతో చక్కని సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ సూచించారు. అన్ని పోలీస్ స్టేషన్లలో నేరస్థులపై ప్రత్యేక డ్రైవ్‌లు, హోటళ్లు, లాడ్జీలలో క్రమం తప్పకుండా తనిఖీలు, భద్రతా వాహనాల మోహరింపు, కె - 9 స్క్వాడ్ మోహరింపు, తొక్కిసలాట వంటి పరిస్థితులను నివారించడానికి అప్రమత్తమైన, ప్రత్యేక ఏర్పాట్లు, ప్రముఖ వ్యక్తుల కోసం ప్రత్యేక హెలిప్యాడ్, పోలీసు బలగాల వసతి కోసం ప్రత్యేక సౌకర్యాలు, వాహన రవాణా క్రమబద్ధీకరణ, బారికేడ్ ఏర్పాట్లు, జిల్లా యంత్రాంగం సహకారంతో వివిధ సమస్యలను త్వరగా పరిష్కరించడం, భక్తులకు క్రమబద్ధమైన దర్శనం కోసం ప్రత్యేక సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఈ సమావేశంలో, డైరెక్టర్ (ఇంటెలిజెన్స్) ఆర్. పి. కోచే, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సెక్యూరిటీ (ఆధునికీకరణ) సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సెక్యూరిటీ (రైల్, కోస్తా భద్రత) అరుణ్ బోత్రా, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సెక్యూరిటీ శాంతిభద్రతలు) సంజయ్ కుమార్, రవాణా కమిషనర్ అమితాబ్ ఠాకూర్, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సెక్యూరిటీ (కమ్యూనికేషన్) దయాళ్ గంగ్వార్, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సెక్యూరిటీ (ఎస్‌ఏపీ) రాజేష్ కుమార్, ఐజీ (సెంట్రల్ రీజియన్) ఎస్. ప్రవీణ్ కుమార్, ఐజీ (ఆపరేషన్స్) డాక్టర్ దీపక్ కుమార్, ఐజీ (బీపీఎస్ పీఏ) అనుప్ సాహు, ఐజీ (క్రైమ్ బ్రాంచ్) డాక్టర్ సార్థక్ సదాంగి, డీఐజీ (ప్రొవిజనింగ్) చరణ్ సింగ్ మీనా, డీఐజీ (ఎస్ఐడబ్ల్యూ) డాక్టర్ కన్వర్ హబీబ్ సింగ్, డీఐజీ (ఎస్ పీఎఫ్) పినాక్ మిశ్రా, పోలీసు సూపరింటెండెంట్ (రైల్వేస్) వివేకానంద్ శర్మ, పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వినీత్ అగర్వాల్, అనేక మంది సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బ్రాహ్మణ సమాజం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

రాయగడ: మునిగుడలోని బ్రాహ్మణ సమాజం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షులుగా విద్యాధర్ దాస్, కార్యదర్శిగా సింహాచల్ పండా, ఉపాధ్యక్షులుగా రామప్రసాద్ రథో, సహకార్యదర్శిగా లక్ష్మీ పాణిగ్రాహి, కోశాధికారిగా రామక్రిష్ణ పాణిగ్రాహిలు నియమితులవ్వగా ప్రభాత్ పాణిగ్రాహి, సింహాచల్ దాస్, క్షమా సాగర్ దాస్, నారాయణ పండా, దమోదర్ మహాపాత్రో, ఆమీర్ కుమార్ మిశ్రో, తరణీ చరణ్ పండా, సౌమ్యరంజన్ సాహు, రవీంద్ర కుమార్ త్రిపాఠిలు కోర్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఆదివారం సాయంత్రం ఈ మేరకు మునిగుడలోని బ్రాహ్మణ సమాజం సమావేశం హాల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. సమాజంలోని సమస్యల పరిష్కారానికి అంతా కలసి కట్టుగా కృషి చేయాలని నిర్ణయించారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



గతుకులతో చెరువులా ఉన్న 26 వ జాతీయ రహదారి నుంచి డొంగర దారి

జయపురం: జయపురం సమితి కుములిపుట్ రోడ్డు మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఆ గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయక పోతే ఆందోళన చేపడతామని ఆ గ్రామ పెద్దలు ప్రతాప్ గౌఢ, సుదీప్ పొద్దార్, హరిశ్చంద్ర ముదులి, ప్రశాంత ఖొర, సూర్యనారాయణ భొత్ర, సూర్య భొత్ర, పంకజ బోష్,తులారాం నాయిక్ మొదలగు వారు అధికారులను హెచ్చరించారు. కుమిలిపుట్ మీదుగా 26 వ జాతీయ రహదారి ఉందని, ఆ జాతీయ రహదారి గతుకుల మయంగా ఉందని, అంతే కాకుండా జాతీయ రహదారి నుంచి డొంగరుకు రహదారి ఉందని ఆ మార్గం గోతులతో నిండి ఉందని వారు వెల్లడించారు. డొంగర రహదారిపై 6 గ్రామాల ప్రజలు ఆధార పడుతున్నారని, అంతే కాకుండా వారసంత, ధాన్యం మండీ, మొదలగు కార్యాలయాలు డొంగర రహదారి లోనే ఉన్నాయని తెలిపారు. అలాగనే ఈ మార్గం ఇరువైపులా కొంత మంది ఆక్రమించి కట్టడాలు నిర్మించారని ఆరోపించారు. అందువలన రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ దారిలో అంబులెన్స్‌లు రావడం లేదని, వెంటనే రోడ్డు బాగు చేయాలని కోరారు.

జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణపై సమీక్ష



కాంట్రాక్టర్ ప్రతినిధితో చర్చిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: జయపురం చారిత్రాత్మక జగన్నాథ సాగర్ పునరుద్ధరణ పనులను జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి సోమవారం సమీక్షించారు. సాగర్ పునరుద్ధరణ పనులు జరుగుతుండగా బాహిణీపతి నేటి ఉదయం జగన్నాథ్ సాగర్ వద్దకు వెళ్లి జరుగుతున్న పనులు ఎలా జరుగుతున్నదీ పరిశీలించారు. సాగర్‌లో ఉన్న మట్టి, పూడిక పనులపై అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్ ప్రతినిధికి తెలిపారు. పనులు వేగంగా జరుపుతున్న సమయంలో వానలు పడడంతో ఆటంకం కలిగిందని అన్నారు. సాగర్ పనులు చేస్తున్న పనివాళ్లకు రక్షణ కరువైందని, తమ కంపెనీ డ్రైవర్ పడుకున్న సమయంలో అతడి సెల్‌ఫోను, డబ్బు ఎవరో దొంగిలించారని ఎమ్మెల్యేకు తెలిపారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే స్పందించారు. వెంటనే ఆయన పట్టణ పోలీసు అధికారికి ఫోను చేసి వెంటనే సాగర్ ప్రాంతంలో పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు సాగర్ సందర్శించిన వారిలో మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, మున్సిపాలిటీ అదనపు కార్యనిర్వాహక అధికారి పూజ రవుత్, ఇంజినీర్ అజయ కుమార్ జాని, జూనియర్ ఇంజనీర్ ప్రతాప్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు బోల్తా: 25 మందికి గాయాలు



గాయాలైన వారికి చికిత్స అందజేస్తున్న వైద్యులు

మల్కన్‌గిరి:

మల్కన్‌గిరి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న బిజాఘటిలో సోమవారం ఉదయం ఓ ప్రైవేటు బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 25 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలాజి ట్రావెల్స్‌కు చెందిన ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్ నుంచి భవానీపట్నం వెళ్తోంది. బస్సులో 37 మంది ఉన్నారు. బిజాఘటి వద్దకు చేరేసరికి బస్సు అదుపు తప్పి పడిపోయింది. విషయం తెలుసుకున్న మల్కన్‌గిరి ఐఐసి రీగాన్‌కీండో తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.



క్షతగ్రాత్రుడి వివరాలు సేకరిస్తున్న సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి



బస్సు నుంచి ప్రయాణికులను బయటకు తీస్తున్న దృశ్యం



తలకిందులుగా పడిన బస్సు

మూడు పోలీస్ స్టేషన్లలో ఐఐసీలు బదిలీలు





కేకేబికే కుహోరో ప్రసన్న కుమార్ ఉత్తమ కుమార్ సాహు)

రాయగడ: జిల్లాలోని మూడు ప్రధాన పోలీస్ స్టేషన్లలో ఐఐసీలను బదిలీ చేస్తు జిల్లా ఎస్పీ స్వాతి ఎస్ కుమార్ ఆదివారం ఉత్తర్యులను జారీ చేశారు. శాంతి భద్రతలను మరింత మెరుగు పరిచేందుకు ఈ మేరకు బదిలీలను చేసినట్లు సమాచారం. రాయగడ ఐఐసీగా విధులు నిర్వహిస్తున్న కేకేబీకే కుహోరోను గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్‌కుబదిలీ చేయగా గుణుపూర్‌లో విధులు నిర్వహిస్తున్న ఉత్తమ కుమార్ సాహును చందిలి పోలీస్ స్టేషన్‌కు.. అదేవిధంగా చందిలి పోలీస్ స్టేషన్ ఐఐసీగా విధులు నిర్వహిస్తున్న ప్రసన్న బెహర కు రాయగడకు బదిలీ చేశారు.

ట్రాక్టర్-బైక్ ఢీ: ఒకరి మృతి



బలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద దిలీప్ మృతదేహం వద్ద రోదిస్తున్న పిల్లలు



దిలీప్‌ను పరీక్షిస్తున్న వైద్యుడు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి సదాశివపూర్ గ్రామ సమీపంలో జయపురం-బలిమెల రహదారిపై సోమవారం సాయంత్రం ఓ రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌పై వస్తున్న భార్యాభర్తలు, ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టి పడిపోయాడు. ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. కోరుకొండ సమితి పరిధిలో ఉన్న ఎంవీ 104 గ్రామానికి చెందిన దిలీప్ రూపతాస్ (50) తన భార్య సుచిత్రా (43)తో కలిసి బైక్‌పై ఉమర్‌కోటలోని బంధువుల ఇంటికి వెళ్లి సోమవారం తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన సుచిత్రను మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు మాధవ బిసాయి

జయపురం: మన న్యాయమైన డిమాండ్‌లు నేరవేరాలంటే అందరం సమైక్యంగా ఆందోళన చేపట్టాలని ఒడిశా డ్రైవర్ల మహాసంఘ బొయిపరిగుడ సమితి శాఖ అధ్యక్షుడు మాధవ బిశాయి పిలుపునిచ్చారు. నేడు జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి డ్రైవర్ల సమావేశం బొయిపరిగుడ సంత తోటలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ డిమాండ్ల సాధనకు ఒడిశా డ్రైవర్ల మహాసంఘం స్టీరింగ్ చడో ఆందోళన చేపట్టాలని నిర్ణయించిందని, అందుకు అందరూ సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. మహాసంఘం 9 డిమాండ్‌లను ప్రభుత్వం ముందు ఉంచగా పాలకులు కేవలం ఒక్క డిమాండ్ మాత్రం నేరవేర్చారని ఆయన డ్రైవర్లకు వివరించారు. మిగతా 8 డిమాండ్లను తుంగలో తొక్కారని విమర్శించారు. డ్రైవర్లకు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని, జాతీయ రహదారిలో ప్రతి వంద కిలోమీటర్లకు ఒకర టాయిలెట్‌తో పాటు పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, డ్రైవర్ల పిల్లలకు ఉచిత విద్యా సౌకర్యం కల్పించాలని, డ్రైవర్లు ఏ తప్పు లేకుండా దాడులకు గురవుతున్నారని వాటిని అరికట్టి డ్రైవర్లకు రక్షణ కల్పించాలని కోరారు. డిమాండ్లను మరో సారి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. డిమాండ్లు అంగీకరించకుంటే మరోసారి స్టీరింగ్ ఛడో ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు సీతమ్ సాగరియ, కార్యదర్శి నరేష్ కంశారి, సహాయ కార్యదర్శి మోమణ పాత్రొ, కోశాధ్యక్షుడు శ్యామ సుందర చలాన్ తో పాటు సమితిలోగల అనేకమంది డ్రైవర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా రథయాత్ర

● సన్నాహక సమావేశంలో అధికారులు



సమావేశంలో తహసీల్దార్ ప్రియదర్శిని, అదనపు కలెక్టర్ నాయక్, ఏడీఎం కుహోరొ తదితరులు

రాయగడ: ఈ నెల 27వ తేదీన జరగనున్న జగన్నాథ రథాయాత్రను పకడ్బందీగా నిర్వహించాలని ఉన్నతాధికారులు అన్నారు. రథాయాత్ర నిర్వహణపై స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సన్నాహక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్, ఎడీఎం నిహారి రంజన్ కుహారో, రాయగడ తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి తదితరులు హాజరయ్యారు. ఈ ఏడాది రథయాత్రను అందరి సహకారంతో ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్ అన్నారు. గత ఏడాది రథాయాత్ర నిర్వహణలో భాగంగా విరాళాల రూపంలో 34,14,439 రూపాయలు లభించగా అందుకు సంబంధించి ఖర్చయిన 15,47,820 రుపాయల వివరాలను తహసీల్దార్ ప్రియదర్శిని సమావేశంలో నివేదించారు. ఈ ఏడాది విరాళాల వసూళ్ల బాధ్యతను తహసీల్దార్‌తో సహా మరో ప్రత్యేక కమిటీకి అప్పగించారు. యాత్ర తొమ్మిది రోజులు స్వామి వారిని దర్శించుకునేందుకు గుండిచా మందిరానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తగిన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ నాయక్ ఆదేశించారు. దీంతో పాటు ప్రత్యేక పోలీస్ దళంతో గస్తీని ఆయా ప్రాంతాలోఏర్పాటు చేయాలని అందుకు పోలీస్ యంత్రాంగం కూడా తగిన విధంగా సహకరించాలని అన్నారు. సమావేశంవో రాజ పురోహితుడు బీరంచి నారాయణ దాస్, రాయగడ మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

విశాఖలో రాయగడ కార్మికుడు మృతి



జిరంగో పంచాయతీ రఘునాథపూర్ గ్రామంలో దహన సంస్కారాలు



వలస కార్మికుడు సహదేవ్ బోడోరయితో ఇంట్లో తల్లి దండ్రులు, విషాదం లో కుటుంబ సభ్యులు



వలసకార్మికుడు సహదేవ్ బోడోరయితో

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయగడ బ్లాక్ జిరంగో గ్రామ పంచాయతీ రఘునాథపూర్ గ్రామానికి చెందిన వలస కార్మికులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంకు వెళ్లి విధివశాత్తు రెండు రోజుల క్రితం మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రఘునాథపూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ పేద కుటుంబం సుభాష్ బోడోరయితో పెద్ద కుమారుడు సహదేవ్ బోడోరయితో (22) తన కుటుంబ పోషణ కోసం విశాఖపట్నంకు ఉపాధి కోసం కొద్ది రోజుల కిందట ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. అయితే ఇటీవలే పనిచేస్తుండగా తన ఆరోగ్యం విషమించి విశాఖపట్నంలో గీతం ప్రైవేటు మెడికల్ కళాశాలలో సిబ్బంది చికిత్సకోసం చేరిన తర్వాత అక్కడ డాక్టర్లు మృతి చెందాడని మే నెల 30న నిర్ధారించారు. చేతిలో డబ్బులు లేనందున ఆయన చేస్తున్న కంపెనీ సహోద్యోగుల సహకారంతో మే 31న రాయగడ బ్లాక్ రఘునాథ్ పూర్‌కు మృతుడు సహదేవ్ బోడోరయితో శవాన్ని అంబులెన్సులో తీసుకువచ్చి ఆదివారం దహన సంస్కారాలు చేశారు. వలస కార్మికుడి కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని జిల్లా లేబర్ అధికారిని తండ్రి సుభాష్ బోడోరయితో, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 81 వినతులు



తులసిపాడు గ్రామానికి చెందిన దివ్యాంగుని సమస్యను వింటున్న కలెక్టర్ దాస్



దివ్యాంగుని గోడును వింటున్న జిల్లా సామాజిక శాఖ అధికారి



గ్రీవెన్సుసెల్‌కు హాజరైన వివిధ శాఖల అధికారులు

పర్లాకిమిడి: స్థానిక గజపతి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా యంత్రాంగం గ్రీవెన్సు సెల్‌ను ప్రారంభించింది. జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా ఎస్పీ జ్యోతీంద్రనాథ్ పండా, డీఎఫ్‌వో కె.నాగరాజు, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణాధికారి శంకర కెరకెటా తదితరులు హాజరయ్యారు. గ్రీవెన్స్‌కు మొత్తం 81 వినతులు అధికారులకు అందగా వాటిలో రెండు వినతులను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా వాటిలో 75 వ్యక్తిగతం కాగా, ఆరు గ్రామసమస్యలకు సంబంధించినవి. తులసిపాడు గ్రామానికి చెందిన దివ్యాంగునికి ఉపాధి అవకాశం కల్పించాలని, త్రీవీలర్ బండి ప్రభుత్వం అందజేయాలని ఆయన కలెక్టర్‌ను కోరాడు. మరికొంతమంది వృద్ధాప్య పింఛన్లు, రేషన్ కార్డులకు సంబంధించి వినతులు అందజేశారు. పర్లాకిమిడి, సిద్ధమణుగు, రాణిపేట, కత్తలకవిటి గ్రామలకు చెందిన వారు వినతులను అందించారు.

క్లుప్తంగా

నేడు జాబ్ మేళా

కాశీబుగ్గ: పలాసలోని డాక్టర్ వి.కణితిష్ ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వికాస ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ ఆధ్వర్యంలో ఇసుజు మోటార్స్ లిమిటెడ్, ఇండో ఎంఐఎం, మోడీన్ థర్మల్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, హుందాయ్ మోబీస్, హుందాయ్ గ్లోవిస్, ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్, పిల్ కింగ్టన్ కంపెనీలకు సంబంధించి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమో, బీటెక్ వంటి అర్హత కలిగిన 26 సంవత్సరాల్లోపు యువతీ, యువకులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 91828 94790, 97056 52552 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పోలీసు ఫైరింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్

మందస: మండలంలోని గొల్లలపాలెం గ్రామానికి చెందిన మామిడి పాపారావు యాదవ్ 300 మీటర్ల ఫైరింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. పాపారావు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పోలీసుగా పని చేస్తున్నారు. ఇదివరకు 2021 సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రెసిడెంట్ మెడల్ సాధించారు. 300 మీటర్ల ఫైరింగ్‌లో గోల్డ్ మెడల్‌ను తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. దీంతో ఆయనను పలువురు అభినందించారు.

02పిఎల్ఎస్43: మెడల్ అందుకుంటున్న పాపారావు

గంజాయితో వ్యక్తి అరెస్టు

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధికి చెందిన చిట్టా ఎర్రయ్య అనే వ్యక్తిని టెక్కలి పోలీసులు గంజాయితో అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం ఒలేసాగరం సమీపంలో సీఐ విజయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఎర్రయ్య పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయడంతో అతడిని పట్టుకుని తనిఖీ చేయగా 620 గ్రాముల గంజాయి పట్టుబడింది. అయితే సదరు వ్యక్తి గంజాయి అమ్మడంతో పాటు తాను సైతం తాగుతుంటాడని తెలిపారు. ఈ మేరకు సోమవారం కేసు నమోదు చేశారు. అతడిపై 2023వ సంవత్సరం జూలైలో సైతం గంజాయి కేసు నమోదైంది.

02టెక్కలి23: వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

నాటుసారాతో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనం, నాటుసారా ప్యాకెట్లు

కవిటి: మండల పరిధిలోని లండారిపుట్టుగ సమీపంలో సోమవారం మొబైల్ పెట్రోలింగ్ ఎక్సైజ్ సీఐ జీవీ రమణ నేతృత్వంలో చేసిన దాడుల్లో 250 నాటుసారా ప్యాకెట్లతో నర్తు జగ్గారావు అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ఈ దాడిలో సారా ప్యాకెట్లు తీసుకొచ్చేందుకు వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని సైతం స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఎక్సైజ్ శాఖకు ఈ కేసు బదలాయించినట్లు పేర్కొన్నారు.

భార్య అనుమానాస్పద మృతి కేసులో భర్త అరెస్టు

కొత్తూరు: మండలంలోని మహార్తాపరంలో నివాసం ఉంటున్న నిమ్మక ప్రవల్లిక మే 29వ తేదీన ఆత్మహత్యకు పాల్పడింది. అయితే తమ అల్లుడు పత్తిక సురేష్ అదనపు కట్నం వేధింపులు కారణంగానే కుమార్తె మృతి చెందినట్లు మృతురాలు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎండీ అమీర్ అలీ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో మృతురాలు భర్త సురేష్‌ను సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ చెప్పారు.

బొల్లినేని విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

శ్రీకాకుళం రూరల్: ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ప్రకటించిన బీఎస్సీ పారా మెడికల్ మొదటి సంవత్సరం ఫలితాల్లో బొల్లినేని మెడిస్కిల్స్‌కు చెందిన యు.వాగ్దేవి(540) యూనివర్సిటీ రెండో ర్యాంకు సాధించినట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అలాగే బి.బిందు, యశ్వంత్, సునీత, భార్గవి, షణ్ముఖశ్రీ, ప్రసన్న వివిధ విభాగాల్లో మంచి ర్యాంకులు సాధించారు. దీంతో వీరికి అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీపద్మజ, సిబ్బంది అభినందనలు తెలిపారు. అలాగే బొల్లినేని మెడిస్కిల్స్‌లో బీఎస్సీ పారామెడికల్, డిప్లొమా కోర్సులకు ప్రవేశాలు జరుగుతున్నట్లు వెల్లడించారు.

వియత్నాంలో గవర్నర్ పర్యటన



వియత్నాంలో చారిత్రాత్మక మై సన్ ఆలయ సముదాయం

భువనేశ్వర్: బుద్ధుని పవిత్ర అవశేషాలను భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి వియత్నాం వెళ్లిన విషయం విదితమే. ఈ పర్యటనలో భాగంగా ఆదివారం క్వాంగ్ నామ్ ప్రావిన్స్‌లోని ప్రసిద్ధ మై సన్ ఆలయ సముదాయాన్ని గవర్నర్ సందర్శించారు. ఈ ప్రాంతం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు సాధించింది. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) సహాయంతో ఈ ప్రాంతం పునరుద్ధరణ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్ సందర్శన మరింత ప్రాముఖ్యతను జోడిస్తుంది.

మై సన్ వియత్నాం అత్యంత విలువైన సాంస్కృతిక ప్రదేశాలలో ఒకటి కావడం విశేషం. ఈ సముదాయంలో 4వ శతాబ్దం నాటి కొన్ని హిందూ దేవాలయాలు ఉన్నాయి. ఈ ప్రాచీన దేవాలయాలను చంపా రాజ్యం నిర్మించింది. ఆగ్నేయాసియా యొక్క ఉమ్మడి సాంస్కృతిక గతానికి కీలక చిహ్నలుగా పరిగణిస్తారు.

ఈ సందర్శన పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ భారత దేశం మద్దతుతో జరుగుతున్న పునరుద్ధరణ పురోగతిని ప్రత్యక్షంగా సమీక్షించారు. ఈ సముదాయంలో పురాతన నిర్మాణాలను సంరక్షించేందుకు ఉపయోగిస్తున్న ప్రత్యేక పద్ధతుల్ని అధికారులు గవర్నర్‌కు వివరించారు. చుట్టూ పచ్చని పర్వతాలు, జరజర ప్రవహించే నీటి వాగుల మధ్య ఒక సుందరమైన లోయ పరిసరాల్లో మై సన్ ఆలయ సముదాయం నెలకొని ఉంది. ఇది 7వ, 13వ శతాబ్దాల మధ్య చంపా నాగరికతకు ముఖ్యమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

మై సన్ ఆలయ సముదాయంలో దాదాపు 70 ఆలయ నిర్మాణాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా జీవ కళని ప్రతిబింబిస్తున్నాయి. ఒక ప్రత్యేకమైన పద్ధతితో నిర్మించబడిన ఈ దేవాలయాలు శతాబ్దాలుగా బలంగా నిలిచి ఉండడం చరిత్రకారులు, వాస్తుశిల్పుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. ఈ ప్రాంతం చంపా రాజ్యం మరియు భారత దేశం, చైనా వంటి గొప్ప నాగరికతల మధ్య సాంస్కృతిక సంబంధాలను ప్రతిబింబింప జేస్తుంది. ఒడిశా గవర్నర్ పర్యటన భారత దేశం, వియత్నాం మధ్య సన్నిహిత సాంస్కృతిక బంధాన్ని, ఉమ్మడి వారసత్వాన్ని పరిరక్షించడంలో భారత దేశం యొక్క నిరంతర పాత్రకు నిలువునా అద్దం పడుతుంది.



సముదాయంలో ఆలయాల సంరక్షణ సమీక్షిస్తున్న రాష్ట్ర గవర్నర్



వియత్నాంలో చారిత్రాత్మక మై సన్ ఆలయ సముదాయం సందర్శనలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి

రాయగడ మామిడికి డిమాండ్



మేళాను ప్రారంభించిన కలెక్టర్ పట్వారి

- మేళాను ప్రారంభించిన కలెక్టర్ ఫరూల్ పట్వారి

రాయగడ: సేంద్రియ ఎరువులతో పండించే రాయగడ మామిడి పండ్లకు దేశ, విదేశాల్లో మంచి గిరాకీ ఉందని జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం సమీపంలో సోమవారం ఒర్మాస్ సంస్థ ఏర్పాటు చేసిన మామిడి మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని కాసీపూర్, రాయగడ, బిసంకటక్, కొలనార, మునిగుడ, కల్యాణసింగుపూర్ తదితర ప్రాంతాల్లో పండే మామిడి పండ్లు దేశంలోనే కాకుండా విదేశాలకు ఎగుమతి అవుతున్నట్లు తెలిపారు. గతేడాది ఇటలీ, పోలాండ్ వంటి దేశాలకు రాయగడ మామిడి పండ్లు ఎగుమతి అయ్యాయన్నారు. ఢిల్లీ, భువనేశ్వర్ వంటి ప్రారిశ్రామిక ప్రాంతాలకు ఇక్కడి మామిడి ఎగుమతి జరిగి రైతులు మంచి లాభాలను ఆర్జించినట్లు గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా ఇక్కడి మామిడిని ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు సన్నహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఓర్మాస్ రాయగడ శాఖ ముఖ్య సంచాలకులు మనోజ్ కుమార్ పాత్రో, జి.లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఫార్మ్ ప్రోడెక్ట్ సంస్థలకు చెందిన మహిళా రైతులు ఈ మేళాలో పాల్గొని, వారు పండించిన మామిడి పండ్లను ఈ ప్రదర్శనలో ఉంచారన్నారు. మార్కెట్ ధరల కన్నా ఇక్కడ అతి చౌకగా మామిడి పండ్లు లభించడంతోపాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసి సేంద్రియ ఎరువుల సహాయంతో పండించినట్లు తెలిపారు. అత్యంత ప్రాధాన్యత గల అమరాపల్లి, బంగినపల్లి, సుందరి, మల్లిక, దశహరి వంటి ఏడు రాకాల మామిడి పండ్లు ప్రదర్శనలో చోటు చేసుకున్నాయని వివరించారు. ఈ నెల 6వ తేదీ వరకు ఈ ప్రదర్శన ఉంటుందని, కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మామిడి మేళాకు సంబంధించిన ప్రచార రథాన్ని కలెక్టర్ పట్వారి ప్రారంభించారు. రాయగడ, జేకే పూర్‌లో ఈ మేళా కొనసాతున్నట్లు పాత్రో తెలియజేశారు.



మామిడి పండ్లను విక్రయిస్తున్న మహిళా రైతులు

వినతుల వెల్లువ

రాయగడ: స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఎఫ్ఓ అన్నాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 55 వినతులు స్వీకరించారు. 53 వ్యక్తిగత సమస్యలు, రెండు గ్రామ సమస్యలుగా గుర్తించారు. ఈ సందర్భంగా 11 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.28 వేలను కలెక్టర్ అందించారు.



రాయగడ: వినతులు సేకరిస్తున్న కలెక్టర్ పట్వారి, ఎస్పీ స్వాతి, డీఎఫ్ఓ అన్నాసాహెబ్

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. మల్కన్‌గిరి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు 27 వినతులు స్వీకరించారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యలు ఏ శాఖకు చెందినవో తెలుసుకుని ఆ శాఖ అధికారులతో చర్చించాలని ఆదేశించారు. ఈ కర్యక్రమంలో ఎస్పీ వినోద్ కుమార్ పటేల్, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రదాన్, జిల్లా సబ్ కలెక్టర్ దూర్యోధన్ బోయి, జిల్లా అభివృద్ధిశాఖ అధికారి నరేశ్ సభోర, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



వినతిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్

భార్యను హత్య చేసిన భర్త

రాయగడ: భార్య, భర్తలు ఇద్దరూ పూటుగా మద్యం సేవించిన అనంతరం మాటామాటా పెరిగి ఇద్దరి మధ్య గొడవలు చెలరేగాయి. దీంతో కోపొద్రిక్తుడైన భర్త భార్యను గొడ్డలితో నరికి హత్య చేశాడు. జిల్లాలోని మునిగుడ సమితి అంబొదలలోని రఘుబారి పంచాయతీలోని మతాబారు గ్రామంలో ఈ ఘోరం ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఎస్‌డీపీవో సంతోషిణి ఓరం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మతాబారు గ్రామంలో నివసిస్తున్న తుతు మాఝి, చిత్ర మాఝిలు భార్యా భర్తలు. కొద్ది నెలలుగా ఇద్దరి మధ్య కుటుంబ కలహాలు చెలరేగుతున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇద్దరూ పూటుగా మద్యం తాగారు. అనంతరం ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో భార్య చిత్ర భర్తను చెంపపై కొట్టింది. కొపొద్రిక్తుడైన భర్త తుతు ఇంట్లోని గొడ్డలిని తీసుకువచ్చి భార్యను దారుణంగా నరికి చంపి అక్కడి నుండి పరారయ్యాడు. దర్యాప్తు చేసిన పోలీసులు సోమవారం తుతుని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అంబొదల పోలీస్ స్టేషన్లో కేసు నమోదయ్యింది.


గంజాయి కేసులో మరో నలుగురు అరెస్టు



మీడియ సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్‌డీపీ, తదితరులు

జయపురం: సంత తోటలో గత నెల 29న దొరికిన గంజాయి కేసులో మరో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి పార్థ జగన్నాథ్ కాశ్యప్ సోమవారం వెల్లడించారు. జయపురం పట్టణ పోలీసు స్టేషన్ సభాగృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమర కుమార్ బహుదూర్ ఉరఫ్ శంకర లంబ(37), చింటు ముదులి(29), సంజయ కోశ్ల(29), కేశవ హరిజన్(30)ని అరెస్టు చేసినట్లు వెల్లడించారు.మొత్తం ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 51 ఫిర్యాదులు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రమణ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి 51 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాలతో అదనపు ఎస్పీ (అడ్మిన్) కేవీ రమణ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వ్యక్తిగతంగా మాట్లాడి, సమస్యలు తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌కాల్స్ ద్వారా తక్షణమే తెలియపరచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నరసన్నపేట: జాతీయ రహదారిపై గుండవల్లిపేట పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌కు చెందిన సల్మాన్ (19) మృతి చెందాడు. ముందున్న లారీకి వెనుక నుంచి బలంగా చెన్నై నుంచి కోల్‌కతాకు వెళ్తున్న కార్గో లారీ బలంగా ఢీకొంది. దీంతో లారీ నడుపుతున్న సల్మాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న నరసన్నపేట పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి వచ్చి వాహనాలను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు.



మృతి చెందిన సల్మాన్



నుజ్జయిన లారీ ముందరి భాగం


ఉపాధి పనికి వెళ్తూ వృద్ధుడు మృతి

పాతపట్నం: మండల కేంద్రంలోని కొత్త దేవాంగుల వీధికి చెందిన ఎర్ర రామారావు (64) ఉపాధి పనికి వెళ్తూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొత్త దేవాంగుల వీధికి చెందిన ఎర్ర రామారావు, అతని భార్య జయమ్మలు కలిసి వీధిలోని అందరితో పాటు సోమవారం ఉదయం నీలమణిదుర్గ ఆలయం సమీపంలో ఉన్న తాడి చెరువులో ఉపాధి పని కోసం ఇంటి నుంచి నడుచుకుంటూ బయల్దేరి వెళ్లాడు. అయితే కాకితోట వద్ద కడుపు నొప్పిగా ఉందని రామారావు కూర్చొని పోవడంతో ఉపాధి కూలీలందరూ కలిసి రోడ్డు మీదకు తీసుకొచ్చారు. అనంతరం ఆటోలో పాతపట్నం సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అయితే అతను అప్పటికే మృతి చెందాడని ఆస్పత్రి సిబ్బంది తెలపడంతో భార్య జయమ్మ రోదన అందరినీ కంటతడి పెట్టించింది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఎర్ర రామారావు (ఫైల్)

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి




వంకల తాతారావు(ఫైల్)

పలాస: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన వంకల తాతారావు(60) కిడ్నీ వ్యాధితో సోమవారం మృతి చెందారు. గత ఏడాది కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కాశీబుగ్గ కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం ఆస్పత్రికి వెళ్లాడు. డయాలసిస్ చేయిస్తుండగా హఠాత్తుగా అక్కడే మృతి చెందాడు. వెంటనే మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురం గ్రామ సమీప కొండమ్మ కాలనీకి ఆనుకుని వెళ్లే జాతీయ రహదారి ప్రదేశంలో 65 సంవత్సరాల వయస్సు ఉన్నటువంటి ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శ్రీకాకుళం రూరల్ పోలీసులు సోమవారం గుర్తించారు. మధ్యాహ్నం నుంచి అచేతన స్థితిలో పడి ఉండడాన్ని కొంతమంది చూసినట్లు తెలిపారు. ఎవరో మద్యం మత్తులో ఉన్నారు అనుకొని ఎవరూ పట్టించుకోలేదు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్ఐ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా చనిపోయినట్లు గుర్తించారు. మృతదేహాన్ని రిమ్స్‌కి తరలించారు. బంధువులు ఎవరైనా గుర్తిస్తే శ్రీకాకుళం రూరల్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.



గుర్తు తెలియని మృతదేహం

ఘనంగా నీలమ్మ ఉత్సవాలు

పర్లాకిమిడి: స్థానిక ఒడియా చాకలి(రజక) వీధిలో గ్రామ దేవత నీలమ్మ పండుగలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం అమ్మవారు ఘటాలను పట్టణంలోని పలు కూడళ్లలో ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా పులి వేషాధారణలతో పలువురు ఆకట్టుకున్నారు. బుధవారం అమ్మవారి అనుపోత్సవం నిర్వహించనున్నారు.



ఆరోగ్య వీధిలో గ్రామదేవత నీలమ్మ ఘటాల ఊరేగింపు



నీలమ్మ అమ్మవారి ఉత్సవాలు

పాముకాటుతో మహిళ మృతి

- మరో ఇద్దరి పరిస్థితి విషమం

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలోని అమీన్‌సాహెబ్‌పేటలో ఆదివారం రాత్రి తలగాన పూజ(27), వంజరాన జయరాం, గీత కృష్ణవేణిలు నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేయడంతో తలగాన పూజ మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతురాలి బంధువులు ఇచ్చిన సమాచారం ప్రకారం కవిటి మండలం శావసానపుట్టుగ గ్రామానికి చెందిన తలగాన పూజ అమీన్‌సాహెబ్ పేటలో జరుగుతున్న ఆలయ ప్రతిష్టకు అమ్మమ్మ గారింటికి వచ్చింది. దీనిలో భాగంగా కుటుంబ సభ్యులతో పాటు అర్ధరాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు చూశారు. అనంతరం ఇంటికి వెళ్లగా ఉక్కగా ఉండడంతో ఇంటి వరండాలో పడుకున్నారు. అయితే ఆ సమయంలో వారి ముగ్గురినీ పాముకాటు వేసింది. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ముగ్గురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బరంపురం తరలిస్తుండగా మార్గమధ్యలో తలగాన పూజ మృతి చెందినట్లు తెలిపారు. వంజరాన జయరాం, గీత కృష్ణవేణిలకు ఐసీయూ ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. మృతురాలి భర్త తలగాన శంకర్ రోజుకూలీ చేస్తూ జీవిస్తుంటారు.



తలగాన పూజ (ఫైల్)



పూజ మృతదేహం

సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
- మీకోసంలో 87 అర్జీలు స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: పెండింగ్‌లో ఉన్న అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక(మీకోసం)లో ఆయన 87 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తహసీల్దార్ల వద్ద వివిధ సర్టిఫికెట్లు పెండింగులో ఉన్నాయని, పెండింగ్‌కు గల కారణాలు తెలియజేయాలన్నారు. సకాలంలో సర్టిఫికెట్లు జారీ చేయకుంటే విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. సత్వరమే సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశించారు. రైస్ కార్డులు పెండింగులో లేకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, డ్వామా, సర్వే అండ్ లాండ్ రికార్డులు, మహిళా శిశు సంక్షేమం, రిజిస్ట్రేషన్, సర్వశిక్ష అభియాన్, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, ఏపీఈపీడీసీఎల్, జీజీహెచ్ తదితర శాఖలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎస్ వి.శ్రీధర్‌రాజ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

జూనియర్ కాలేజీలు పునః ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో 2025–26 కొత్త విద్యా సంవత్సరంలో జూనియర్ కాలేజీలు పునః ప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం సోమవారం జిల్లాలో జూనియర్ కాలేజీలు తెరుచుకున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు శతశాతం పనిచేశాయి. ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు హాజరయ్యారు. అయితే విద్యార్థులు మాత్రం అంతంతమాత్రంగానే హాజరైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని కాలేజీల్లో కనీసం పది మంది కూడా హాజరుకాలేదని తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీలకై తే కనీసం విద్యార్థులే రాలేదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. హాజరైన పిల్లలతో క్లాసులతోపాటు సమీప గ్రామాల్లో అడ్మిషన్ డ్రైవ్స్‌ను నిర్వహిస్తున్నారు. పిల్లలు హాజరైన చోట డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు ఇంటర్ విద్య జిల్లా అధికారి ఆర్.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. శతశాతం మంది విద్యార్థులు కాలేజీలకు హాజరయ్యేవిధంగా ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని సూచించారు. ఇంటర్ కోర్సులను అందిస్తున్న ప్రభుత్వ యాజమాన్య కాలేజీలకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రా పేరిట అందజేసిన పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ వెంటనే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

ఇంటిపైకి దూసుకెళ్లిన కారు..

• ముగ్గురికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో ఇంటిపైకి దూసుకెళ్లిన కారు

విజయనగరం గంటస్తంభం/క్రైమ్: విజయనగరం సన్‌స్కూల్ పక్కన రామకృష్ణ నగర్‌లో నివాసముంటున్న పట్నాన సత్యవతి ఇంటిపైకి డంపింగ్ యార్డు మీదుగా 15 అడుగుల ఎత్తు నుంచి ఓ కారు దూసుకువచ్చింది. ఈ ఘటనలో పట్నాన సత్యవతి(60), గొద్దు వినయ్(14), పట్నాన వినయ్(12) కారు కింద ఇరుక్కుపోయారు. దీంతో కాలనీ యువకులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని కారును ఎత్తి వారిని బయటకు తీశారు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరావు, ఎం.శాంతమూర్తి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అర్ధరాత్రి మద్యం తాగుతూ కారును నడిపిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

హైవోల్టేజ్‌తో కాలిపోయిన టీవీలు



కాలి బూడిదైన ఫ్యాన్లు, టీవీ, ఇతర వస్తువులు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని జొన్నగుడ్డి రువ్వవీధిలో హైవోల్టేజ్ రావడంతో సోమవారం ఓ ఇంట్లోని ఫ్యాన్లు, టీవీ, కూలర్, లైట్లు కాలిపోయాయి. అలాగే బట్టలతో సహా అన్నీ కాలిపోయాయి. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలిపోవడంతో బాధిత కుటుంబం ఆవేదన చెందుతోంది.

25 లీటర్ల సారా పట్టివేత



తహసీల్దార్ కార్యాలయం వద్ద అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

సీతంపేట: మండలంలోని కొత్తకోట జంక్షన్ వద్ద 25 లీటర్ల సారా అక్రమరవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు దోనుబాయి ఎస్సై మస్తాన్ తెలిపారు. వీరఘట్టానికి చెందిన శివయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్..

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద వేగావతినదిలో అక్రమంగా ఇసుక తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం ఆర్‌డీఓ జేవీవీఎస్ రామ్మోహనారావు అదుపులోకి తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి తరలిస్తున్నందుకు గాను ట్రాక్టర్ యజమానికి రూ.10వేల జరిమానా విధించామని తహసీల్దార్ ఎం.శ్రీను తెలిపారు.

లారీని ఢీకొని ఇద్దరికి గాయాలు

గుర్ల: మండలంలోని అచ్యుతాపురం వద్ద సోమవారం ఇద్దరు యువకులు గాయపడ్డారు. మెరకముడిదాం మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన స్వామి, వాసులు ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్తుండగా అచ్యుతాపురం వద్ద విజయనగరం నుంచి వస్తున్న లారీని బలంగా ఢీకొట్టడంతో ఇద్దరికీ తలపై గాయాల య్యా యి. గుర్ల పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

రెడ్డి ల్యాబ్స్ ఉద్యోగిని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన భారతి

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. పడాల పేటలో ఉంటున్న నడిపేన భారతి, పూసపాటి రేగ వద్ద గల రెడ్డి ల్యాబ్స్‌లో పని చేస్తోంది. వృత్తిలో పర్మినెంట్ కాలేదని కొన్ని రోజుల క్రితం ఆమె కన్నల్లికి చెప్పింది. చేస్తున్న పనిలో ఒత్తిడి కూడా అధికం అవడం, తల్లికి భారమవుతున్నానన్న బాధతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలని భావించి డ్యూటీ నుంచి రాగానే ఇంట్లోని తన గదిలో తలుపేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఈ మేరకు భారతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి



ఫిర్యాదు దారుతో మాట్లాడుతున్న ఏఎస్పీ అంకితా సురానా

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రాధాన్యంతో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశమందిరంలో కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 63 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోపు అర్జీదారు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, పునఃపరిశీలన లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 32 వినతులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 32 వినతులు వచ్చాయి. జమ్మడుగూడ గ్రామానికి చెందిన సవర కళ్యాణ్ రహదారి మంజూరు చేయాలన్నారు. చిన్నపొల్లకు చెందిన శ్రీలత కుట్టుమిషన్ ఇప్పించాలని కోరారు. మామిడి, జీడి మొక్కలు పంపిణీ చేయాలని కురసింగి గ్రామస్తులు వినతి ఇచ్చారు. కోడిశ గ్రామస్తుడు హెచ్.రవి వన్‌బి అడంగల్ ఇప్పించాలన్నారు. ట్రాక్టర్ లోన్ మంజూరు చేయాలని పద్మాపురం గ్రామస్తుడు మనోసింగు కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఎస్.వి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అందిన విజ్ఞప్తులలో కొన్ని..

- ముత్యాల సెంటర్ నుంచి కొత్తం గ్రామం వరకు మెయిన్ రోడ్డు మంజూరు చేయాలని సీతంపేట మండలం కొత్తం గ్రామానికి చెందిన సవర.గంగయ్య అర్జీ అందజేశారు.
- వీరఘట్టం మండలం అడారు గ్రామానికి చెందిన సీహెచ్. దుర్గమ్మ ఐసీడీఎస్ ప్రాజెక్టులో పనిచేస్తూ 2022 జూలైలో పదవీ విరమణ పొందియున్నానని, ప్రభుత్వం నుంచి తనకు రావాల్సిన బెనిఫిట్స్ ఏమీ అందలేదని, బెనిఫిట్స్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- పార్వతీపురం మండలం గడబవలస గ్రామానికి చెందిన కె. జగన్నాథం జీవన ఉపాధికోసం ట్రాక్టర్ కొనడానికి ప్రభుత్వం రుణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
- సాలూరు మండలం మావుడి గ్రామానికి చెందిన సీహెచ్ అశోక్(ఎస్టీ కొండదొర) కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, డ్వామా పీడీ కె. రామచంద్రరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రాబర్ట్ పాల్, ఉద్యానవనశాఖ అధికారి బి.శ్యామల, పశుసంవర్ధక శాఖ అధికారి డా.ఎస్.మన్మథరావు, డీఆర్‌డీఏ ఏపీడీ ఎం.సుధారాణి, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, డీఎంహెచ్‌ఓ డా.ఎస్.భాస్కరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు ఆర్.కృష్ణవేణి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

పార్వతీపురం రూరల్: ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఉత్తర్వుల మేరకు పార్వతీపురం ఏఎస్పీ అంకితా సురానా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన నాలుగు ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, అత్తారింటి వేధింపులు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు తదితర సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం సమస్యలను సంబంధింత పరిధిలో ఉన్న స్టేషన్ అధికారులకు అప్పగించి వాటిని దర్యాప్తు చేసి తక్షణ చర్యలు చేపట్టి జిల్లా పోలీసుశాఖ కార్యాలయానికి నివేదికను పంపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వినతులకు సత్వర పరిష్కారం చూపాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్ తదితర అధికారులు

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన వినతులకు సత్వర పరిష్కారం చూపడంతో పాటు వాటిని అర్జీదారులు సంతృప్తి చెందే రీతిలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా వినతులు పరిష్కరించేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని పద్ధతులను పాటిస్తూ వాటిని పరిష్కరిస్తున్నారా? లేదా? అనే అంశంపై వినతుల ఆడిట్ పూర్తి చేయాలని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో అందిన వినతుల పరిష్కారంపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినతుల స్వీకరణ కార్యక్రమానికి హాజరుకాని జిల్లా అధికారులపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, వెంకటేశ్వరరావు, నూకరాజు, ప్రమీల గాంధీ తదితరులు 143 వినతులు స్వీకరించారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 32 ఫిర్యాదులు



డీపీఓలో పీజీఆర్ఎస్లో ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకుంటున్న ఎస్పీ, ఏఎస్పీలు

విజయనగరం క్రైమ్: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలతలు బాధితుల నుంచి 32 ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలతల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు పరిశీలించారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7 రోజుల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్కే చౌదరి, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామస్థాయి యోగా శిక్షణ

• జాయింట్ కలెక్టర్ డాక్టర్ సేతు మాధవన్



మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి యోగా శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమవుతుందని దీనికి ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా అధికారులకు జేసీ పలు సూచనలు చేశారు. ప్రతి సచివాలయానికి 9 మంది యోగా శిక్షకులను ఎంపిక చేశామని, వారి ద్వారా 3వ తేదీ నుంచి ఒక్కో బ్యాచ్‌కు 70 మంది చొప్పున 3 రోజుల యోగా శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. దీని కోసం ఎంపిక ఎంపిక చేసిన ప్రదేశాలను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఐదు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న వారిని మాత్రమే యోగా శిక్షకులుగా ఎంపిక చేసినట్లు స్పష్టం చేశారు. ఇలా జూన్ 14 వరకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ జరుగుతుందని గ్రామంలోని దాదాపు అందరికీ యోగా శిక్షణ ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

బండెమ్మ తల్లి హుండీల చోరీ



బండెమ్మ ఆలయంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ సభ్యులు

శృంగవరపుకోట: పద్నాలుగు ఏళ్ల తర్వాత ఎస్.కోట మండలంలోని సీతంపేట గ్రామంలో వేడుకగా జరిగిన జరిగిన బండెమ్మ తల్లి పండగ భక్తుల్లో కొత్త ఉత్సాహం నింపినా, వారి మనోభావాల్ని మాత్రం దొంగలు దెబ్బకొట్టారు. ఆదివారం రాత్రి అమ్మవారి అనుపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాత్రి 12గంటల వరకూ అమ్మవారి ఆలయం వద్ద సందడిగానే ఉంది. రాత్రి 12గంటల సమయంలో అనువంశిక అర్చకులు, పెద్దలు అమ్మవారికి చెల్లించాల్సిన కానుకలు, ముడుపులు చెల్లించి ఇళ్లకు వెళ్లారు. అమ్మవారి ఆలయం వద్ద సందడి సద్దుమణగగానే దొంగలు పక్కాగా ప్లాన్ అమలు చేశారు. రాత్రి 12గంటల తర్వాత ఆలయంలో ఉన్న స్టీల్, ఐరన్ హుండీలను ఎత్తుకుపోయారు. స్టీల్ హుండీ పగలగొట్టి పక్కన ఉన్న పశువుల పాకలో పడేశారు. ఇనుప హుండీని మాత్రం పట్టుకుపోయారు. 14 ఏళ్ల తర్వాత పండుగ జరగడంతో అమ్మవారికి ఆదాయం దండిగానే వచ్చింది. సుమారు లక్ష రూపాయలు చోరీకి గురైఉంటాయని గ్రామ పెద్దలు చెబుతున్నారు. చోరీ విషయం తెలుసుకున్న ఎస్.కోట పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామంటూ ఎస్.కోట పోలీసులు చెబుతున్నారు.

ఐదుగురు గంజాయి నిందితుల అరెస్ట్



పట్టుబడిన నిందితులతో ఎస్సై సన్యాసినాయుడు, సిబ్బంది

డెంకాడ: డెంకాడ మండలం బెల్లాం గ్రామం దగ్గరలో గల భాష్యం లే-అవుట్లో కొంతమంది వ్యక్తులు గంజాయి వినియోగిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో డెంకాడ ఎస్సై ఎ.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, యాంటీ గంజాయి టీమ్ జూన్ 2న దాడులు నిర్వహించి, గంజాయి పీలుస్తూ, విక్రయాలకు పాల్పడుతున్న ఒక జువైనల్ సహా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. అరెస్టయిన వారి నుంచి 1.330కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు, రూ.200 నగదును డెంకాడ ఎస్సై సన్యాసినాయుడు సీజ్ చేసినట్లు చెప్పారు. పట్టుబడిన నిందితుల్లో ఎ-1 జామి మండలం అలమండ గ్రామానికి చెందిన దాసరి గాంధీ (24) గంజాయి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని చెప్పారు. అదేవిధంగా డెంకాడ మండలం బెల్లాం గ్రామానికి చెందిన జుతిక శ్యామ్ (ఎ-2, 19 సంలు) మాల్లపురెడ్డి రాకేష్ (ఎ-3) దిబ్బగుడ్డి గ్రామానికి చెందిన మల్లపురెడ్డి వేణు (ఎ-4) సహా జువైనల్(5) గంజాయి పీలుస్తున్నట్లు విచారణలో వెల్లడైందని ఎస్పీ వివరించారు. గంజాయి విక్రయాలు జరిపిన వ్యక్తితో సహా, గంజాయి వినియోగిస్తున్న మరో నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

అల్లంత దూరాన..!

చద్దన్నం కంటే ఊరగాయ రుచే ఎక్కువైందని వాపోతున్నారు గిరిజనం. ప్రభుత్వం ఫ్రీగా రేషన్ బియ్యం ఇస్తున్నా వాటిని ఇంటికి చేర్చాలంటే కనీసం రూ.100 ఖర్చు పెట్టాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఇంటింటికీ రేషన్ అందించి మేలు చేశారని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మళ్లీ పాత కష్టాలు పరిచయం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ సరుకుల కోసం 20 నుంచి 40 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయక తప్పదని ఒక రోజంతా పని మానుకోవాల్సి వస్తోందని ఆవేదన వెళ్లగక్కుతున్నారు. రేషన్ సరుకులు పొందడానికి గిరిజనులు పడుతున్న కష్టాలకు అక్షర రూపం.

- రేషన్ బియ్యం ఫ్రీ అయినా..
- ఇంటికి చేర్చేందుకు రూ.100 ఖర్చు
- సరుకులు కావాలంటే 20-25 కిలోమీటర్ల ప్రయాణం
- అష్టకష్టాలు పడుతున్న గిరిజనులు



ఆటోలో సరుకులు తీసుకు వెళ్తున్న గిరిజనులు



దిగువ మెండంగి డిపోలో రేషన్ కోసం క్యూలో ఉన్న గిరిజన మహిళలు



దిగువ మెండంగిలో రేషన్ సరుకులు కోసం వెళ్తున్న గిరిజనులు

సాలూరు రూరల్: మండలంలోని దిగువ మెండంగి డిపోలో రేషన్ సరుకుల కోసం డొంకల వెలగవలస, పనసలవలస తదితర గ్రామాల ప్రజలు సోమవారం ఆటోలో వచ్చి సరుకులు తీసుకున్నారు. ఈ సరుకులు తీసుకుని వారి గ్రామానికి చేరాలంటే రూ.100 ఆటో చార్జీ వెచ్చించాల్సిందేనని గిరిజన మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చేది ఫ్రీ బియ్యమే కానీ అవి ఇంటికి చేరాలంటే మాకు వందరూపాయలు ఖర్చు అవుతోందని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన రెడ్డి ఇంటింటికీ రేషన్ సరుకులు అందించి పేదలకు ఎంతో మేలు చేశారని ఇంటివద్దే సరుకులు తీసుకుని ప్రశాంతంగా ఉండేవారమని చెబుతున్నారు. కానీ ఇప్పుడు పాత పద్ధతిలోనే రేషన్ సరుకుల కోసం ఒక రోజంతా సమయం కేటాయించడంతో పాటు ప్రయాణానికి చార్జీల రూపంలో ఖర్చులు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను కనుమరుగు చేసే క్రమంలో ఇంటింటికీ రేషన్ ఇచ్చే వాహనాలతో పాటు ఎండీయూ ఆపరేటర్లను తొలగించడంపై మండిపడుతున్నారు. ఈ క్రమంలో ఇంటింటి రేషన్ పంపిణీ నిలిపివేయడంతో ఏజెన్సీలోని గిరిశిఖర గ్రామాల ప్రజలు డిపోల నుంచి రేషన్ తెచ్చుకోవాలంటే 20-25 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నుంచి ఇంటింటికీ రేషన్ పంపిణీతో ఎంతో మేలు జరిగిందనుకున్న తరుణంలో మళ్లీ కూటమి ప్రభుత్వం పాత పద్ధతినే రేషన్ డిపోలో క్యూలో నిలబడి రేషన్ సరుకులు అందుకునే విధంగా చర్యలు తీసుకోవడంపై ముఖ్యంగా గిరిజనులు వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. కొదమ పంచాయతీలోని 13 గ్రామాల ప్రజలు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న నంద గ్రామంలో రేషన్ సరుకులు తీసుకోవాల్సి వస్తోంది. కొఠియా, గంజాయిభద్ర పంచాయతీల ప్రజలు నేరెళ్ల వలస డిపోకు 15 కిలోమీటర్లు కొండ దిగి వస్తున్నారు. అలాగే డెన్సరాయి సంపంగిపాడు పంచాయతీలకు చెందిన 10 గ్రామాల ప్రజలు కురుకుట్టి రేషన్ డిపోకు చేరుకోడానికి 10 కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. జిల్లేడు వలస పంచాయతీ ప్రజలు దండిగాం డిపోకు 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. కరడవలస పంచాయతీ గిరిజనులు ఏకంగా 40 కిలోమీటర్లు ప్రయాణించడంతో పాటు రెండు వైపులా రూ.300 చార్జీలు రూపంలో వెచ్చించాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా సాలూరు మండలంలోని గిరిశిఖర గ్రామాల ప్రజలకు డిపోలలో సరుకులు తీసుకోవాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని చెబుతున్నారు.

ఏజెన్సీ వాసులకు మళ్లీ పాతకష్టాలే



మండలంలోని ఏజెన్సీ వాసులకు ఎండీయూ వాహనాల రద్దుతో మళ్లీ రేషన్ తీసుకోడానికి డిపోలకు వెళ్లాలంటే డబ్బుల ఖర్చుతో పాటు రోజంతా సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నుంచి గిరిజనులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారిని మరిన్ని ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదు. ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఎం.బీసు గంజాయిభద్ర గ్రామం

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి





చినమరికి గదబవలస మధ్యలో ఉన్న మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం, (ఇన్‌సెట్లో) మృతుడు చెట్లా సింహాచలం (ఫైల్)

పార్వతీపురం రూరల్: మండలంలోని చిన్నమరికి గదబవలస గ్రామాల మధ్యలో ఉన్న మలుపు వద్ద సోమవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో జియ్యమ్మవలస మండలం బసంగి గదబవలసకు చెందిన చాట్ల సింహాచలం (33) మృతి చెందినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు



జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. గత నెల 30 నుంచి ఈనెల 1వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో జరిగిన 9వ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన 8 మంది క్రీడాకారులు రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకం, 5 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో కొల్లు హిమశ్రీ, ఎస్.ఉదయ్‌వరుణ్‌లు బంగారు పతకాలు సాధించగా.. ఎం.శ్రీరామ్‌నాయుడు రజత పతకం దక్కించుకున్నాడు. అదేవిధంగా సోము శ్యామ్‌కుమార్, ఎస్.శ్యామ్‌శ్రీవర్ధన్, బి.సాయిచైతన్య, ఎ.గగన్‌దీప్, కె.శ్రీనివాసరావులు కాంస్య పతకాలు దక్కించుకున్న వారిలో ఉన్నారు. పతకాలు దక్కించుకున్న క్రీడాకారులను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, చీఫ్ కోచ్ డీవీ చారిప్రసాద్, జిల్లా అసోసియేషన్ సభ్యులు పిల్లా శ్రీనివాస్, ఎస్.సతీష్‌కుమార్, టి.మురళీకృష్ణ, టి.వెంకటేష్ తదితరులు అభినందించారు.

375 గ్రాముల గంజాయి స్వాధీనం

• ఇద్దరి అరెస్ట్



గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, సిబ్బంది

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు గంజాయి విక్రయదారులను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని పెద్ద చెరువు రామానాయుడు రోడ్డులో కొంతమంది వ్యక్తులు గంజాయి పీలుస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఉడాకాలనీకి చెందిన వజ్జల భరత్ కుమార్, లంకాపట్నానికి చెందిన చిన్న మనోహర్‌లు గంజాయి పీలుస్తూ, విక్రయాలకు పాల్పడుతుండగా పట్టుకున్నారు.వారి దగ్గర నుంచి 375 గ్రాముల గంజాయి, రూ.350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గంజాయిని చిన్న మొత్తాల్లో విక్రయిస్తున్నట్లు నిందితులు విచారణలో అంగీకరించారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాస్ చెప్పారు.

యోగాంధ్ర అర్బన్ లెవెల్ పోటీలు



పోటీల్లో భాగంగా యోగాసనాలు వేస్తున్న బాలలు

విజయనగరం: అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర 2025 అర్బన్ స్థాయి పోటీలను విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సోమవారం ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక రాజీవ్ స్టేడియంలో యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, మెడిటేషన్‌కు సంబంధించి 10 నుంచి 18 సంవత్సరాలలోపు బాలబాలికలకు అర్బన్ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఈనెల రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అర్బన్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా స్థాయి పోటీలకు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు, పీడీలు, పీఈటీలు, యోగా శిక్షకులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.